క్లుప్తంగా

ఉపాధి ప్రగతి లక్ష్యాలను చేరుకోండి



మాట్లాడుతున్న ఏపీఓ ఓబిరెడ్డి

యల్లనూరు: ఉపాధి హామీ కూలీలు వలసలు వెళ్లకుండా జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామని ఏపీఓ ఓబిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ హార్టికల్చర్ పండ్ల మొక్కలను వంద శాతం బతికించుకోవాలన్నారు. రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను కాపాడుకోవాలన్నారు. 7ఏ రిజిస్టర్లు, వర్కుఫైల్స్ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీ సత్యమూర్తి, టీఏలు జయరాం, ప్రసాద్, పురుషోత్తంనాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు గిరి, చంద్ర, సుజాతలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పత్తి, మొక్కజొన్న పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, ఏఓ

తాడిపత్రి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కృషి విజ్ఞాన శాస్త్రవేత్త కిషోర్, ఏఓ ఆంజనేయులు పర్యటించి పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కొనగుంటపల్లి, దిగువపల్లి, తేరన్నపల్లి గ్రామాల్లోని రైతులతో వారు మాట్లాడారు. పంటలను వచ్చే తెగుళ్లు, దిగుబడి పెంపునకు తీసుకోవలసిన సస్య రక్షణచర్యలను వివరించారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

గార్లదిన్నె: యూరియా అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ సాయిలక్ష్మి హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని న్యూవరి సిద్ధి వినాయక ఫర్టిలైజర్ ,శ్రీగురు ఆగ్రో ఏజెన్సీస్, లక్ష్మీ నరసింహ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో యూరియా నిల్వలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, గోడౌన్ స్టాక్ ఒకే విధంగా ఉండాలన్నారు. మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందన్నారు.

గొడవలకు పాల్పడితే చర్యలు



శనగలగూడూరులో మాట్లాడుతున్న సీఐ సత్యబాబు

పుట్లూరు: గ్రామాల్లో ఘర్షణలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని శనగలగూడూరు గ్రామంలో పుట్లూరు, యల్లనూరు పోలీసులతో కలసి నాకాబందీ చేపట్టారు. వివాదాస్పదమైన వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అనుమానాస్పద వ్యక్తుల గురించి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యల్లనూరు ఎస్‌ఐ రామాంజులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలి'

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్ చౌదరి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కమలాపురం, కొప్పలకొండ, గ్రామాలకు ఏడు సంవత్సరాల క్రితం బస్సు సర్వీస్ ఉండేదన్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాలకు బస్సు సర్వీస్ నిలుపుదల చేశారన్నారు. రోజూ వందల మంది విద్యార్థులు, కొప్పలకొండ, గార్లదిన్నెలో ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూళ్లో, అనంతపురంలో చదివేందుకు సైకిల్, ఆటోల్లో వెళ్తుంటారన్నారు. ఆయా గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

జాగ్రత్తలు తీసుకోండి



గ్రామాల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల: ప్రజలు జ్వరాలు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి శంకర్ నాయక్ సూచించారు. గురువారం మండలంలోని రాచేపల్లి, నిదనవాడ గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించారు. గ్రామాల్లో జ్వరాలు వచ్చిన వారికి వైద్యం అందించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించి వర్షపు నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గంగాధర్, రాధ, రమణ, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రద్దీ ఎక్కువ.. రైళ్లు తక్కువ

- ఆదాయం ఉన్నా.. తాడిపత్రిలో ఆగకుండా వెళ్తున్న రైళ్లు
- ప్రయాణికుల ఇబ్బందులను పట్టించుకోని రైల్వే అధికారులు



తాడిపత్రి రూరల్: ఏటా తాడిపత్రి నుంచి ఇతర ప్రాంతాలకు ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే అందుకు అనుగుణంగా అధికారులు రైళ్లను ఏర్పాటు చేయకపోవడంతోపాటు తాడిపత్రి మీదుగా వెళ్లే రైళ్లను సైతం నిలబడకపోవడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రైళ్ల ప్రయాణికుల డిమాండ్‌కు సరిపోవడం లేదు. రోజూ పెద్దఎత్తున ప్రయాణికులు రైళ్లల్లో కిక్కిరిసి వెళుతున్నారు. జనరల్ భోగీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటోంది. కొన్ని సమయాల్లో తోపులాటల వల్ల ప్రయాణికులు కింద పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. ప్రధానంగా పగటి పూట ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా రైళ్లు లేవు. తాడిపత్రి మీదుగా వెళ్లే అన్ని రైళ్లను నిలపాలని ఎన్నో ఏళ్లుగా ఉన్న డిమాండ్‌ను పట్టించుకోవడం లేదు. తాడిపత్రి నుంచి వెళుతున్న రైళ్లను నిలపాలని 2014 నుంచి ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడంతోనే సరిపోతోంది. తాడిపత్రి రైల్వేస్టేషన్ తనిఖీ కోసం పలుమార్లు వచ్చిన జీఎంల దృష్టికి వివిధ పార్టీల నాయకులు, ప్రయాణికులు సమస్యను తీసుకువచ్చినా పరిశీలిస్తామని హామీలు ఇచ్చారే తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో నిలబడని రైళ్లల్లో ఓఖా – రామేశ్వరం, కాచిగూడ – మురుడేశ్వర, బాలాజీ ఎక్స్‌ప్రెస్, హౌరంగబాద్ – తిరుపతి, చైన్నై– హుబ్లీ ఉన్నాయి. తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో రెండు రైళ్లు రానూపోనులో ఒకసారి మాత్రమే నిలబడతాయి. రెండు సార్లు నిలపాలన్న డిమాండ్ ఉంది. ఓకా– మధురై రైలును కొన్ని అనివార్య కారణాల వల్ల రద్దు చేశారు. ఈ రైలు ద్వారా ఎక్కువ మంది భక్తులు అరుణాచలం, మధురై తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. రైలు రద్దు చేయడం పట్ల భక్తులు మండిపడుతూ ఇతర మార్గాల ద్వారా వెళ్లాల్సి వస్తోంది.

రైల్వే అధికారుల నిర్లక్ష్యం

తాడిపత్రి రైల్వే ఆదాయం ఏడాదికి ఏడాది పెరుగుతోంది. అందుకు అనుగుణంగా రైళ్ల సంఖ్యను పెంచడంతో రైల్వే శాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. రోజూ 150 నుంచి 200 వందల మంది రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. తాడిపత్రి మూడు జిల్లాలకు సరిహద్దుగా ఉంది. ఆయా ప్రాంతాల్లో సోలార్, విండ్, సిమెంట్, స్టీల్ పరిశ్రమలు విస్తరించడంతో దేశంలోని బీహార్, ఉత్తర ప్రదేశ్, అస్సాం, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలు, ఉద్యోగులు వచ్చి పనిచేస్తున్నారు.వీరి రాకపోకల వల్ల ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. అలాగే తాడిపత్రి పట్టణంతో పాటు పరిసర మండలాలకు చెందిన విద్యార్థులు విజయవాడ, తిరుపతి, హైదరాబాద్ తదితర నగరాల్లో ఇంటర్, బీటెక్‌లతో చదువుతున్నారు. తాడిపత్రి ప్రాంతంలోని వివిధ కళాశాల్లో చదివేందుకు కూడా ఇతర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారు. వీరి రాకపోకల వల్ల రైల్వే అదాయం పెరుగుతోంది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, విజవాడ కనకదుర్గమ్మ, అరుణాచలం వెళ్లే భక్తుల సంఖ్య కూడా ఎక్కువగా ఉంటోంది. అదేవిధంగా తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ముంబయికి రైతులు అరటిని ఎగుమతి చేయడం ద్వారా ఏడాదిలో కోటి రూపాయలకు పైగా ఆదాయం వస్తోంది. ఏటా డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో తాడిపత్రి నుంచి ముంబయికి తరలించి, అక్కడి నుంచి షిప్పుల ద్వారా అరబ్బు, సౌదీ దేశాలకు అరటిని ఎగుమతి చేస్తున్నారు. పుట్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో రెండు కంపెనీలు అరటిని కొనుగోలు చేసి ఏసీ కంటైనర్ల ద్వారా ఎగుమతి చేస్తున్నాయి. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి తాడిపత్రి మీదుగా వెళ్లే అన్ని రైళ్లకూ స్టాపింగ్ ఉండేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తాడిపత్రిలో రైల్వే ఆదాయం ఇలా

సంవత్సరం	ప్రయాణికులు (లక్షలు)	ఆదాయం (రూ.కోట్లల్లో)
2023-24	4.63	రూ.6.35
2024-25	5.02	రూ.7.35
2025-26	2.36	2.38

(ఇప్పటి వరకూ)

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెరుగుతున్న ప్రయాణికుల డిమాండ్ మేరకు కొత్తగా రైళ్లను నడపడంతోపాటు నిలపకుండా వెళ్తున్న వాటిని నిలపాలని పలువురిని నుంచి వినతులు వస్తున్నాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలన్న డిమాండ్ కూడా ఉంది.

– కేహెచ్ కుమార్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్

సజావుగా వాహనాల వేలం

గుంతకల్లు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలను వేలం వేయగా రూ.57000 ఆదాయం లభించినట్లు సీఐ శివసాగర్ గురువారం తెలిపారు. అలాగే సీజ్ చేసిన 46 కేసుల్లో 278 లీటర్ల మద్యం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి సమక్షంలో ధ్వంసం చేశామన్నారు

మట్కా బీటర్ అరెస్టు

యాడికి: మండలంలో మట్కాబీటర్‌ను అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండల కేంద్రంలోని కుంటలో ఖాదర్‌బాషా అనే వ్యక్తి గత కొంత కాలంగా మట్కా రాస్తున్నాడు. గురువారం సాయంత్రం అందిన సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో వెళ్లి మట్కా రాస్తున్న ఖాదర్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి రూ.7,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే కుంటలో మద్యం విక్రయిస్తున్న ఓగేటి శ్రీరంగ అనే వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 10 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

గుంతకల్లు: తప్పిపోయిన ఓ బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ తెలిపిన మేరకు.. మండలంలోని ములకలపెంటకు చెందిన మేకల తిమ్మప్ప తన కూతురు శ్రీవల్లి ఇటీవల కర్నూలు జిల్లా పత్తికొండలో ఉన్న బంధువులు ఇంటికి వెళ్లింది. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ములకలపెంట వెళ్లడానికి పత్తికొండ నుంచి బాలిక ఒంటరిగా బయలుదేరింది. అయితే సాయంత్రం 6.30 గంటలైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తిమ్మప్ప సాయంత్రం 7.00 గంటల సమయంలో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ బాబామున్వర్, ములకలపెంట ఇంచార్జ్ కానిస్టేబుల్ కే.ఓబులేసు, కానిస్టేబుల్ నాగరాజు నేతృత్వంలో శ్రీ వల్లి ఫొటో సాయంతో పట్టణంలో గాలించారు. బస్టాండ్‌లోని సీసీ ఫుటేజీల ఆధారంగా గుంతకల్లుకు వచ్చినట్లు నిర్ధారించుకుని బస్టాండ్ ప్రాంగణంలో బాలికను గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాలికను అప్పగించారు. దీంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి



గుత్తిలో మాట్లాడుతున్న వైపీ బాబు

గుత్తి: కూటమి ప్రభుత్వం తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు వైపీ బాబు డిమాండ్ చేశారు. గుత్తిలో గురువారం ఆయన వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ వింగ్ నాయకులు అబ్రహమయ్య, సాల్మన్ రాజు, జాకోబ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 4,15,000 పింఛన్లు తొలగించిందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో పింఛన్‌ల తొలగింపుపై ఆందోళనలు జరుగుతున్నాయన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 40 శాతం ఉన్న వికలాంగులకు, 60 ఏళ్లు నిండిన వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు ఇచ్చామన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించే వరకూ ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పామిడి: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను తొలగించడం అన్యాయమని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ మండిపడ్డారు. గురువారం మండలంలోని ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉన్న దివ్యాంగులకు పింఛన్లను ఎగ్గొట్టే యత్నం కూటమి ప్రభుత్వ అసమర్థ పాలనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించకపోతే దివ్యాంగులంతా సంఘటితమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సమితి సభ్యులు, భాస్కర్‌బాబు, అశోక్, రాము, చంటి, గోపాల్, మణికంఠ, రషీద్‌భాష, కుమార్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థులకు బెస్ట్ ఐడియా అవార్డు



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న విద్యార్థులు బెస్ట్ ఐడియా అవార్డులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ తెలిపారు. చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ ఆద్వర్యంలో ఎస్‌ఆర్‌ఐటీలో నిర్వహించిన ట్రైనింగ్ 2కె–25 కార్యక్రమంలో భవిష్యత్తులో ఉన్నతమైన ఆలోచనలు ఏవిధంగా అమలుపరచాలో అనే విషయాన్ని ఆరుష్ ఆధ్వర్యంలో సుస్మిత్ టీం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో తృతీయ సంవత్సరం చదువుతున్న మహమ్మద్ హనీఫ్, అబ్దుల్ రహ్మాన్ విద్యార్థులు వివరించారు. దీంతో ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీ వారు విద్యార్థులకు బెస్ట్ ఐడియా అవార్డును అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి, ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి వీర ప్రకాష్, డాక్టర్ చిత్ర లింగప్ప, డాక్టర్ హేమంత్‌కుమార్, డాక్టర్ శశికళ అభినందించారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా చేసుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

గుంతకల్లుటౌన్: వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా చేసుకోవాలని గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. గురువారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని మతపెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మతసామరస్యాన్ని పాటించాలన్నారు. ఈ నెల 30న వినాయక నిమజ్జనం ఊరేగింపులో డీజే, అధిక సౌండ్ సిస్టమ్‌లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. ఊరేగింపులో మద్యం సేవించిన వారు, చిన్నపిల్లలను రాకుండా చూసుకోవాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. వివిధ మతాల పెద్దలు తగు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం నగర ఉత్సవ సమితి వారు డీఎస్పీ, సీఐలను సన్మానించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, మస్తాన్, రూరల్, కసాపురం ఎస్‌ఐలు రాఘవేంద్ర, వెంకటస్వామి, హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

యాడికి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాని ఎంపీడీఓ వీర్రాజు సూచించారు. గురువారం ఉదయం మండలంలోని పుప్పాల, నగరూరు, వేములపాడు గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ఘనంగా రంగనాథుడి కల్యాణోత్సవం



గుత్తి మండలం తొండపాడులో రంగనాథుడి కల్యాణం చేయిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడులో ఉన్న బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో మాణిక్య రంగనాథ స్వామి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అర్చకుడు మురళి వేకువజాము నుంచి స్వామికి అభిషేకాలు, మహా మంగళహారతి, అర్చన, సంప్రోక్షణ, హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బెంగళూరు నుంచి తెచ్చిన రంగరంగుల పూలతో ఆలయాన్ని, కల్యాణ కట్టను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో అశేష భక్తుల సమక్షంలో మంగళవాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవిలతో రంగనాథుడికి వైభవంగా కల్యాణం జరిపించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాణిక్య రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జీవీ.రామన్, గుత్తి, యాడికి, తాడిపత్రి, అనంతపురం, గుంతకల్లు, నంద్యాల జిల్లా డోన్, ప్యాపిలి మండలాలకు చెందిన ఆర్యవైశ్యులు, మాణిక్యరంగనాథ స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో ఉన్న అశ్వత్థ నారాయణస్వామి క్షేత్రంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహించిన వివాహాలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శింగరబట్టు, గణపతి, నారాయణస్వామిని దర్శించుకున్నారు. నూతన దంపతులు స్వామివారి చుట్టూ తిరిగి ప్రదక్షిణలు చేశారు. ఇదిలా ఉండగా వివాహాలు జరిపించే అర్చకులు దేవాదాయశాఖ కట్టడి కన్నా సంభావన పేరుతో వధూవరుల నుంచి ముక్కుపిండి అధిక మొత్తం వసూలు చేయడం విడ్డూరమని పలువురు భక్తులు విమర్శించారు.

రాఘవేంద్రస్వామికి..

తాడిపత్రి రూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో ఉన్న రాఘవేంద్రస్వామి దేవాలయంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించామని ప్రధాన అర్చకుడు విజయేంద్రచార్యులు తెలిపారు. తెల్లవారుజామున రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం, అర్చనలు జరిపి విశేష అలంకరణ చేశామన్నారు.స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





పెద్దపప్పూరులో శింగరబట్టు, గణపతి, నారాయణస్వామి, తాడిపత్రిలో రాఘవేంద్రస్వామి బృందావనం

బార్‌లకు దరఖాస్తు చేసుకోండి



గుంతకల్లులో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుంతకల్లు: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బార్లకు ఔత్సాహికులకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో బార్లకు దరఖాస్తు చేసుకునే ఔత్సాహికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు ఎక్సైజ్ సూపరింటెండ్ రామమోహన్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలో మూడు బార్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బార్ల లైసెన్సుల కోసం ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రెండు సంవత్సరాల కాల వ్యవధికి రూ.5 లక్షలు నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజుతో పాటు రూ.10 వేలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. ఈ నెల 26లోపు చెల్లించాలన్నారు. 28న ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ ద్వారా బార్లు కేటాయిస్తారన్నారు.కార్యక్రమంలో సీఐ శివసాగర్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణానికి ప్రభుత్వం నాలుగు బార్లు కేటాయించినందని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ గడ్డం నాయుడు అన్నారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం బార్ల లైసెన్స్‌ల కోసం దరఖాస్తు విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో గురువారం నూతన బార్ పాలసీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏఈఓ రామ్మోహన్‌లు లైసెన్స్ దారులు, ఔత్సాహికులకు నూతన బార్ పాలసీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్‌ఐలు అస్లాం బేగ్, గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి ఆక్రమణపై ఫిర్యాదు

యాడికి: పూర్వీకుల నుంచి నా భర్తకు వచ్చిన ఆస్తిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, భర్త పేరుపై ఉన్న ఆస్తి తనకే దక్కేటట్లు చూడాలని ఓ వృద్ధురాలు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి విన్నవించారు. వివరాల మేరకు మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన రేణు ప్రకాష్ రెడ్డి, రామేశ్వరమ్మ దంపతులు. వీరికి సంతానం లేదు. 2025 మార్చి 25న అనారోగ్యంతో రేణు ప్రకాష్ రెడ్డి మృతి చెందాడు. ఆయన పేరిట గ్రామ సమీపంలో 12.69 ఎకరాల భూమి ఉంది. ఆయన పేరిట బ్యాంకులో రుణం కూడా ఉంది. కానీ ఆయన మృతి చెందిన తర్వాత ఆయన తమ్ముళ్లు తన భర్త పేరిట ఉన్న పొలాన్ని వాళ్ల పేరిట చేసుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని రామేశ్వరమ్మ కన్నీటితో తహసీల్దార్‌కు విన్నవించారు. వెంటనే నగరూరు వీఆర్వో రంగస్వామిని తహసీల్దార్ పిలిచి రామేశ్వరమ్మ భర్త రేణు ప్రకాష్ రెడ్డి పొలం పరిశీలించి, ఆమెకు న్యాయం చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో ఆయన ఆస్తిని పరిశీలించి న్యాయం చేస్తామని రామేశ్వరమ్మకు తహసీల్దార్ హామీ ఇచ్చారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం



గుత్తిలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



పెద్దవడుగూరులో నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



యల్లనూరులో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



యాడికిలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

గుంతకల్లు రూరల్/గుత్తి/పెద్దవడుగూరు/యల్లనూరు/యాడికి: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం గుంతకల్లు, గుత్తి, పెద్దవడుగూరు,యల్లనూరు, యాడికి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ నాయకులతో కలిసి అంగన్‌వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీ టీచర్లకు రూ.26 వేల వేతనం అమలు చేయాలన్నారు. కేవలం 2జీ మొబైల్స్ ఇచ్చి 5జీ మొబైల్‌తో చేయాల్సిన పనులు చేయమని చెబుతున్నారని ఇదేలా సాధ్యం అని ప్రశ్నించారు. పనికి తగ్గ వేతనంతో పాటు, పనుల నిర్వహణకు అవసరమైన వాటిని కూడా ప్రభుత్వం సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.